క్లుప్తంగా

రైతుబజార్‌లో డీఎస్‌వో తనిఖీలు



బియ్యం స్టాల్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్‌వో సూర్యప్రకాష్‌

సీతంపేట: ధరల నియంత్రణలో భాగంగా నరసింహనగర్‌ రైతుబజార్‌లో సబ్సిడీపై ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు స్టాళ్లను శనివారం జిల్లా పౌర సరఫరాల అధికారి(డీఎస్‌వో) జి.సూర్యప్రకాష్‌ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వినియోగదారులకు ఎల్లప్పుడూ బియ్యం, కందిపప్పు అందుబాటులో ఉంచాలని ఎస్టేట్‌ ఆఫీసర్‌ పి.చినబాబును ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కె.మురళీకృష్ణ, రైతుబజార్‌ ఈవో, సహాయకుడు ఆర్‌.సత్యనారాయణ పాల్గొన్నారు.

● రైతుబజార్‌లో శనివారం సబ్సిడీపై 110 క్రేట్లు విక్రయించినట్టు ఈవో చినబాబు తెలిపారు. మరో 140 క్రేట్లు ఆదివారం విక్రయానికి సిద్ధం చేశామని, ఐదు కౌంటర్లలో టమాటాలు విక్రయిస్తామని చెప్పారు.

రాళ్లు తేలిన రహదారి



దీప్‌ భవన్‌ ఎదురుగా ఇటీవల నిర్మించిన రోడ్డుపై తేలిన రాళ్లు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు పోర్టు స్టేడియం వెనుక నుంచి మాధవధార వైపు వెళ్లే రహదారిలో ఇటీవల గిరిప్రదక్షిణ కోసం ఆగమేఘాల మీద రహదారులను వేశారు. ముఖ్యంగా పోర్టు వాటర్‌ ట్యాంక్స్‌, దీప్‌ భవన్‌ ఎదురుగా హడావుడిగా రాత్రికి రాత్రే బీటీ రోడ్డు నిర్మించారు. వేసిన మరుసటి రోజు నుంచే వర్షాలు కురవడంతో రోడ్డుపై కంకర తేలిపోయింది. దీంతో గిరిప్రదక్షిణ చేసే భక్తులు ఇబ్బంది పడ్డారు.

వర్షాలకు కూలిన ప్రహరీ



ధర్మానగర్‌లో కూలిన ప్రహరీ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 55వ వార్డు ధర్మానగర్‌లోని ప్రహరీ గోడ రెండు రోజులుగా కురిసిన వర్షాలకు బాగా తడిసి కొంత మేర కూలింది. ఎవరికీ ఏ విధమైన ప్రాణ నష్టం గానీ, ప్రమాదం కానీ జరగలేదు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

వైభవ వేంకటేశ్వరుడికి సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణలో భక్తులు, అర్చకుడు

మురళీనగర్‌: కప్పరాడ ఎన్‌జీజీవోస్‌ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయం అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్‌ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దారులన్నీ సింహగిరి వైపే..

- భక్తులతో కోలాహలంగా గిరి ప్రదక్షిణ రహదారి
- దారిపొడవునా ప్రసాదాలు, పానీయాల వితరణ
- భారీగా పోలీస్‌ బందోబస్తు ఏర్పాటు



పాపా హోం జంక్షన్‌ వద్ద పోలీసుల బందోబస్తు



భక్తులకు ప్రసాదం అందిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



సీతమ్మధార అల్లూరి జంక్షన్‌ వద్ద వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులకు అడ్డంగా వస్తున్న వాహనాలు



భక్తులకు బామ్‌లు అందిస్తున్న సింహాద్రి అప్పన్న ప్రచార సమైఖ్య సభ్యులు



భక్తులకు వైద్య సేవలందిస్తున్న వైద్యులు, రోటరీ క్లబ్‌ ప్రతినిధులు

సీతమ్మధార: సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనరసింహ స్వామి గిరిప్రదక్షిణకు భక్తులు పోటెత్తారు. శనివారం నియోజకవర్గంలోని సీతమ్మధార మీదుగా బాలయ్యశాస్త్రి లేఅవుట్‌, రాధాకృష్ణ లేఅవుట్‌, గణేష్‌నగర్‌, నరసింహనగర్‌, కైలాసపురం, మాధవధార, ఆర్‌అండ్‌బీ జంక్షన్‌ ప్రాంతాల్లోని గిరిప్రదక్షిణ రహదారిలో భక్తులు కాలినడకన అప్పన్న దర్శనానికి ముందుకు సాగారు. మాధవధార మాధవ స్వామి ఆలయం వద్ద జలధారలో స్నానమాచరించారు. అనేక జిల్లాలు, ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు దారి పొడవునా పలు స్వచ్ఛంద సంస్థలు, నాయకులు ప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ తదితర తినుబండారాలు, పానీయాలు పంపిణీ చేశారు.

ప్రదక్షిణలో పదనిసలు

● స్థానిక త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద గిరిప్రదక్షిణ భక్తులకు సిరి వెంకటేశ్వర డెవలపర్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ సంస్థ మేనేజింగ్‌ డైరెక్టర్‌ కె.కె.రాజు చక్కెర పొంగలి, టమాటా బాత్‌, ఉప్మా పంపిణీ చేశారు. సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

● బాలయ్యశాస్త్రి లేఅవుట్‌ పాపా హోం ఎదురుగా భక్తులకు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ప్రసాదం అందజేశారు.

● సీతమ్మధార అల్లూరి జంక్షన్‌ వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్‌ జగదీశ్వరరావు సందర్శించారు.

● ఈస్ట్‌ ఏసీపీ జయరాం ప్రసాద్‌ ఆధ్వర్యంలో సీఐలు ఎస్‌.విజయకుమార్‌, శ్రీనివాసరావు, ఎస్‌ఐ వెంకటరావు, పలువురు ఎస్‌ఐలు, సిబ్బంది, ట్రాఫిక్‌ ఎస్‌ఐ భాస్కరరావు ట్రాఫిక్‌, ఇతర సమస్యలు లేకుండా విధులు నిర్వహించారు.

● పోలీస్‌ బలగాలు ఎటువంటి వాహనాలు లోపలకి ప్రవేశించకుండా, భక్తులకు ఏ ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.



సీఐ సికిందర్‌కు ప్రసాదం అందిస్తున్న కీర్తి పట్నాయక్‌

● విజయనగరానికి చెందిన శాస్త్రి అనే భక్తుడు గిరి ప్రదక్షిణకు వెళ్తున్న సమయంలో మరుగుదొడ్లు లేకపోవడం ఇబ్బంది కలిగించిందని వాపోయాడు.

గిరిప్రదక్షిణ మార్గంలో వాహనాల రాకపోకలు

మద్దిపాలెం: గిరిప్రదక్షిణ వేళ భక్తులు హరి నామ స్మరణ చేస్తూ సింహాద్రి అప్పన్న ఆలయానికి 32 కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లారు. సీతమ్మధార మీదుగా ఆర్‌ అండ్‌ బీ జంక్షన్‌ వరకు వచ్చే గిరిప్రదక్షిణ రహదారిపై వాహనాలను అనుమతించడంతో భక్తులు వెళ్లే దారిలో వాహన చోదకులు రాకపోకలు సాగించారు. అటుగా వెళ్తున్న స్థానిక వాహనదారులు, భక్తులు ఇబ్బంది పడ్డారు. గిరిప్రదక్షిణ రహదారిలో వాహనాలను నియంత్రించడంలో ట్రాఫిక్‌ పోలీసులు విఫలమయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు.

● సింహాద్రి అప్పన్న ప్రచార సమైఖ్య వ్యవస్థాపకుడు నారాయణస్వామి ఆధ్వర్యంలో మాధవధార 48ఏ బస్‌ స్టాప్‌ వద్ద భక్తులకు కాసేపు విశ్రాంతి కల్పించారు. కాళ్ల నొప్పులు తగ్గడానికి పలు బామ్‌లు అందజేశారు. 50వ వార్డు కార్పొరేటర్‌ వావిలపల్లి ప్రసాద్‌, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్‌ చేతుల మీదుగా పలు ఆయిల్స్‌, బామ్‌లు, టీ, కాఫీ పంపిణీ చేశారు.

● 51వ వార్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద శనివారం సాయంత్రం కాలినడకన వచ్చిన భక్తులకు కార్పొరేటర్‌ రెయ్యి వెంకటరమణ పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. పేడాడ రమణికుమారి, పైడి శ్రీనివాసరావు, కరిమిరెడ్డి శ్యామ్‌, పొన్నాడ అప్పారావు, పప్పల లక్ష్మణ్‌ పాల్గొన్నారు.

● ఆర్‌ అండ్‌ బీ జంక్షన్‌ మారియట్‌ హోటల్‌ వద్ద క్రెడాయ్‌ సంస్థ విశాఖపట్నం విమెన్‌ అండ్‌ యూత్‌ వింగ్‌ సభ్యులు గిరిప్రదక్షిణ భక్తులకు బటర్‌మిల్క్‌ పంపిణీ చేశారు.

భక్తులకు ‘రోటరీ’ వైద్య సేవలు

సీతంపేట: గిరిప్రదక్షిణలో పాల్గొన్న వేలాది మంది భక్తులకు రోటరీ క్లబ్‌ గ్రేటర్‌ విశాఖ ఉచితంగా వైద్య సేవలు అందించింది. పోర్టు స్టేడియం వెనుక రోడ్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వీ హెల్త్‌ కేర్‌, స్నేహసంధ్య ఏజీకేర్‌ ఫౌండేషన్‌, యెరుమేలు అయ్యప్ప సేవా ట్రస్టు సంయుక్తంగా వేద్య సేవలు అందజేశారు. అస్వస్థకు గురైన వారికి పరీక్షలు నిర్వహించి మందులిచ్చారు. కాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి ఫిజియోథెరపిస్టులు తైలాలతో ఉపశమనం కలిగించారు. మూడు బృందాలుగా 60 మంది వైద్య శిబ్బంది, వైద్యులు ఎల్‌.వి.ఉషారాణి, ఎస్‌.సురేష్‌, పర్వీన్‌ సేవలందించారు. సంస్థ ప్రతినిధులు ఎం.డి.యాసిన్‌, చింతా నేతాజీ, కె.ఎం.కె.రమేష్‌, చిన్నం కృష్ణ, పీతల శ్రీరామమూర్తి, ఎం.సుమతి పాల్గొన్నారు.



భక్తులకు ప్రసాదం అందిస్తున్న కెకె.రాజు

వానలోనే విధులు నిర్వర్తిస్తూ..

తాటిచెట్లపాలెం: గిరిప్రదక్షిణ కోసం భారీ ఏర్పాట్లు చేసి, భారీగా సిబ్బందిని నియమించిన అధికారులు కిందిస్థాయి ఉద్యోగుల భద్రత, రక్షణ మరిచారు. ముఖ్యంగా గిరిప్రదక్షిణ విధుల్లో ఉన్న జీవీఎంసీ శానిటేషన్‌, పోలీసు సిబ్బంది మాత్రం అవస్థలు పడ్డారు. శనివారం ఉదయం నుంచి గిరిప్రదక్షిణ ప్రారంభం కావడంతో ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. ఆయా ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం తాగునీరు, విశ్రాంతి కోసం టెంట్లు, మందులు, టాయిలెట్లు ఏర్పాటు చేశారు. టాయిలెట్ల వద్ద జీవీఎంసీ సిబ్బందిని నియమించి.. వీరికి ఏ నీడ కల్పించలేకపోయారు. దీంతో వీరు నిలువ నీడ లేక మధ్యాహ్నం వరకు వానలో తడుస్తూనే విధులు నిర్వర్తించాల్సి వచ్చింది.



భక్తుల కోసం ఏర్పాటు చేసిన టాయిలెట్ల వద్ద వానలో తడుస్తూ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌ మీదుగా కాలినడకన గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

అప్పన్న భక్తుల సేవలో..

ఓల్డ్‌ స్టూడెంట్స్‌ వితరణ

మహారాణిపేట: గిరిప్రదక్షిణ చేసిన భక్తులకు డాక్టర్‌ వి.ఎస్‌.కృష్ణా కాలేజ్‌ ఓల్డ్‌ స్టూడెంట్స్‌ ఫోరం ఆధ్వర్యంలో ప్రసాదం, ఇడ్లీ, టమాటా బాత్‌, వేడి మిరియాల పాలు అందజేశారు. మెంథోప్లస్‌, జండూబామ్‌లు, భక్తులు వర్షంలో తడవకుండా సుమారు 20 వేల మందికి టోపీలు అందించారు. 15 ఏళ్లుగా అప్పన్న స్వామివారి సేవా కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నామని ఫోరం నాయకులు తెలిపారు. ఫోరం ప్రతినిధులు పట్నాల నాగవెంకట రామ్మోహన్‌రెడ్డి, గుండు వెంకటేష్‌, సింగూరు నర్సింగరావు, భూపతి సత్యనారాయణ, కృష్ణా కాలేజీ లెక్చరర్లు ఉమామహేశ్వరరావు, అరుణ్‌కుమార్‌, ప్రతాప్‌, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్‌ బాలు, ఎన్‌సీసీ క్యాడెట్లు, నిర్వాహకుల కుటుంబ సభ్యులు, స్నేహితులు, అయ్యప్పనగర్‌ వాసులు, యువత ప్రసాద వితరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరం

తాటిచెట్లపాలెం: లక్ష్మీగాయత్రి హాస్పిటల్స్‌ ఆధ్వర్యంలో నరసింహనగర్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. హాస్పిటల్‌ ఎండీ కె.వి.రామ్‌కుమార్‌ మాట్లాడుతూ ప్రతి ఏటా గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులకు ఉచితంగా మందులు, హెల్త్‌ డ్రింక్స్‌ అందజేస్తున్నట్లు తెలిపారు. శనివారం భక్తులకు ఆయింట్‌మెంట్లు, మందులు అందించి అత్యవసరమైన చికిత్సలు చేశారు. హాస్పిటల్‌ సిబ్బంది కోటి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు ప్రసాదం అందిస్తున్న కృష్ణా కాలేజ్‌ ఓల్డ్‌ స్టూడెంట్స్‌ ఫోరం నాయకులు

మురళీనగర్‌ వాసుల సేవలు

మురళీనగర్‌: మాధవధార 48ఏ బస్‌ రూట్‌లో రహదారికి ఇరువైపులా మురళీనగర్‌కు చెందిన పలు సంస్థలు స్టాళ్లు ఏర్పాటు చేసి భక్తులకు సేవలందించాయి. కుర్చీల ఏర్పాటు, టెంట్స్‌లో ఫలహారాలు, మజ్జిగ, టీ/కాఫీ, పులిహోర వంటి పదార్థాలను పంపిణీ చేశారు. మురళీనగర్‌ శ్రీదేవి విజ్ఞానజ్యోతి పరిష్కార్‌ అధ్యక్షురాలు కీర్తి పట్నాయక్‌ ఆధ్వర్యంలో భక్తులకు తినుబండారాలు, ప్రాథమిక చికిత్సకు మందులు పంపిణీ చేశారు. అనంతపురం జిల్లాకు చెందిన సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ సికిందర్‌ పాల్గొన్నారు. మణికంఠ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. వ్యవస్థాపకుడు టీజీపీ శాస్త్రి, జీవీ ఆనందరావు, యు.సురేష్‌కుమార్‌, బి.శ్రీనివాసరావు, ఏఎస్‌రావు, భాస్కరరావు సహకరించారు.

ఘనంగా గురుపూజోత్సవం

సీతంపేట: గురుపౌర్ణమిని పురస్కరించుకుని కార్తికేయ కళాక్షేత్రం ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్‌ పౌర గ్రంథాలయంలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. సంగీత విద్వన్మణి మల్లా ప్రగఢ జోగులాంబ జ్ఞాపకార్థం వారి శిష్యులు, కుటుంబ సభ్యులు కలిసి గాయక విద్వన్మణి ముట్నూరి జలజాక్షిని ‘మహతి నాదనిధి’ బిరుదుతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ఆలిండియా రేడియో విశ్రాంత స్టేషన్‌ డైరెక్టర్‌ కాకరపర్తి సత్యనారాయణ, బీవీకే విశ్రాంత ప్రిన్సిపాల్‌ జె.వి.ఎస్‌.ఎస్‌.మూర్తి మాట్లాడుతూ గురుపౌర్ణమి విశిష్టత, వ్యాసుడు లోకానికి అందించిన జ్ఞాన సంపద గురించి వివరించారు. అనంతరం డాక్టర్‌ నిష్టల కృష్ణవేణి వీణానాదం కార్యక్రమం మంగళపల్లి బాలమురళీకృష్ణ రచనలతో జరిగింది. షణ్ముక ప్రయ రాగంలో వర్ణం, సకల గణాధిప ఆరభిరాగం, బృహదీశ్వర కానడ రాగం, శ్రీదక్షిణామూర్తి కీరవాణి రాగంలో రచనలు హాజరులను అలరించాయి. వీరికి వి.అరుణ సహకార వీణ, ఎం.ఏడుకొండలు మృదంగంపై, హనుమంతరావు ఘటంపై వాద్య సహకారం అందించారు.



గాయక విద్వన్మణి ముట్నూరి జలజాక్షిని సత్కరిస్తున్న అతిథులు

పశువుల బెడద



సీతమ్మధార రైతుబజారులోకి ప్రవేశించి కూరగాయిలు తింటున్న ఆవులు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులోకి శనివారం పశువులు ప్రవేశించడంతో వినియోగదారులు ఇబ్బందులకు గురయ్యారు. వినియోగదారులు కూరగాయలు కొంటున్న సమయంలో ఒక్కసారిగాలో ఆవులు రావడంతో భయాందోళనలకు గురయ్యారు. చిన్న పిల్లలు భయపడ్డారు. బజారులో ప్రతి రోజూ ఇదే పరిస్థితి ఉండటంతో వినియోగదారులతోపాటు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

24న ‘లైమ్‌లైట్స్‌’ అవార్డుల ప్రదానం

తాటిచెట్లపాలెం: ఈవెంట్‌ మేనేజర్స్‌ అసోసియేషన్‌(ఈమా) విశాఖపట్నం చాప్టర్‌ ఆధ్వర్యంలో ఈ నెల 24న మధురవాడలోని వీ కన్వెన్షన్స్‌లో లైమ్‌లైట్స్‌ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు ఈమా అధ్యక్ష, కార్యదర్శులు సందీప్‌కుమార్‌, షరీఫ్‌ఖాన్‌ తెలిపారు. నరసింహనగర్‌లోని తమైరా బ్యూటీ క్లినిక్‌లో శనివారం మీడియా సమావేశంలో వీరు వివరాలు వెల్లడించారు. ప్రతిభావంతులైన ఈవెంట్‌ మేనేజర్లు, కళాకారులు, ఈవెంట్‌ రంగంలోని విభిన్న విభాగాల్లో పనిచేసే వారికి సుమారు 20 కేటగిరీల్లో అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు ఆసక్తి గలవారు ఎంట్రీ రిజిస్ట్రేషన్‌ చేయించుకోవాలని కోరారు. ఈవెంట్‌ ప్రధాన స్పాన్సర్‌ తమైరా స్కిన్‌ అండ్‌ బ్యూటీ క్లినిక్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ సిహెచ్‌.జ్యోతిస్వరూప మాట్లాడుతూ ఈమా అవార్డుల వేడుకల్లో తాము భాగం కావడం సంతోషంగా ఉందన్నారు. సమావేశంలో ఈమా ఆర్గనైజింగ్‌ సెక్రటరీ జి.ఎస్‌.రాజు, జాయింట్‌ సెక్రటరీ సంతోష్‌కుమార్‌, కార్యవర్గ సభ్యుడు జగదీష్‌, ఆషా పట్నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఈమా సభ్యులు

స్టీల్‌ప్లాంట్‌ అంశాలపై అసెంబ్లీలో చర్చిస్తాం

విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌ రాజు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించిన మూడు అంశాలపై రాష్ట్ర అసెంబ్లీలో చర్చించే నిమిత్తం అసెంబ్లీ సెక్రటరీకి నోట్‌ పంపినట్లు విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌ రాజు తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ సమస్యలపై శనివారం ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు ఎమ్మెల్యేను కలవగా ఆయన వారికి ఈ విషయాన్ని తెలిపారు. రాష్ట్ర శాసనసభ 39వ నిబంధనను అనుసరించి ఈ అంశాలను లేవనెత్తనున్నట్లు తెలిపారు. గర్భాం మాంగనీస్‌ మైన్స్‌ రెన్యువల్‌ చేయడం, విద్యుత్‌ బిల్లుల బకాయిలు ఆరు నెలల పాటు వాయిదా వేయడం, విశాఖ స్టీల్‌ ప్లాంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం రెండు వేల కోట్లు అడ్వాన్స్‌ చెల్లించి విశాఖ ఉక్కు ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులలో, హౌసింగ్‌ స్కీముల్లో వినియోగించే విధంగా కోరడంపై చర్చించనున్నట్లు తెలియజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.డి. ప్రసాద్‌ ఉన్నారు.



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌ రాజుతో చర్చిస్తున్న సీ నాయకులు

నేడు గురుపౌర్ణమి ఉత్సవాలు

మురళీనగర్‌: మురళీనగర్‌ రామాలయం ప్రాంగణంలోని షిర్డీసాయి ధ్యాన మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్‌, కార్యదర్శి టి.నారాయణ రెడ్డి తెలిపారు. శైవాగమ పండితుడు అయిలూరి శ్రీనివాసదీక్షితుల పర్యవేక్షణలో అర్చకుడు అయిలూరి రామశాస్త్రి ఆధ్వర్యంలో గురుపూజా మహోత్సవాలు నిర్వహిస్తారు. వేకువజాము 4 గంటలకు కాగడ హారతి, 5 గంటలకు గణపతి పూజ, 7 గంటలకు పన్నీరుతో సాయికి అభిషేకం, ప్రధాన అర్చకులు 51 మందికి పాద పూజ, 11 గంటలకు 108 కలశాలతో అష్టోత్తర కలశాభిషేకం, 11.30 గంటలకు సాయిదత్త మూల మంత్ర హోమం, 12 గంటలకు షిర్డీ సాయిని విశేషంగా అలంకరించి భక్తులకు ప్రత్యేక దర్శనాలు, లక్షోత్తర పూజలు, మధ్యాహ్న హారతి నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం ఉంటుంది.



మురళీనగర్‌లో కొలువైన షిర్డీసాయి

సీతారాముల కల్యాణం

అయోధ్యంలో శ్రీరాముడి విగ్రహం ఏర్పాటు చేసిన సందర్భంగా ఆదివారం సాయంత్రం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు సాయికి పల్లకీ సేవ, 5 నుంచి 8వ వరకు విభూధి అర్చన, 5.30 గంటలకు గోపూజ, 6 గంటలకు సంధ్యాహారతి ఉంటుంది. 6.30 గంటలకు ఆరవిల్లి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకుడు గోపీ నంబాళ్ల శేషుస్వామి పాల్గొంటారు. రాత్రి శేజ్‌ హారతితో ఉత్సవం ముగుస్తుంది.

వాకర్స్‌ పార్కు వార్షికోత్సవానికి ఏర్పాట్లు

మురళీనగర్‌: మురళీనగర్‌లో వాకర్స్‌ పార్కు ఏర్పడి ఆగస్టు 8 నాటికి 27 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వాకర్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు. వాకర్స్‌ పార్కులో శనివారం నిర్వహించిన క్లబ్‌ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. వాకర్స్‌ పార్కు ఏర్పాటుకు కృషి చేసిన ప్రతి ఒక్కరినీ గుర్తు చేసుకున్నారు. వారి సేవలకు గుర్తుగా నెల రోజుల పాటు నిర్వహించనున్న సేవా కార్యక్రమాలను వెల్లడించారు. ఈ నెల 28న విశ్వం ఆస్పత్రి సహకారంతో మెగా వైద్య శిబిరం, సాయంత్రం పూర్వాధ్యక్షుడు కేజీ కృష్ణారావు 90వ జన్మదినోత్సం, ఆగస్టు 8న వాకర్స్‌ క్లబ్‌ నెలవారీ సమావేశం, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి పి.చెల్వారాజు, కోశాధికారి జె.కూర్మారావు, ఉపాధ్యక్షుడు ఏవీ సుబ్బారావు, పూర్వాధ్యక్షులు ఎన్‌.బుచ్చయ్య, ఆర్‌.సత్యనాధం, కె.జి.కృష్ణారావు, కె.ద్వారకానాథ్‌, సంయుక్త కార్యదర్శి సీహెచ్‌.ప్రసాదరావు, జాలీ వాకర్‌ ఎన్‌.ప్రకాశరావు, బోర్డు సభ్యులు టి.వి.రమణ, వి.అప్పారావు, ఎస్‌.రామ్మోహన్‌ రావు, ఎస్‌.శ్రీనివాసరావు, ఆర్‌.నాగేశ్వరావు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పల్లా చంద్రమౌళి

లింగ సమానత్వంపై ఏయూలో జాతీయ వర్క్‌షాప్‌

ఎంవీపీకాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో లింగం, సమానత్వం, ప్రజాస్వామ్య రూపురేఖలు అంశంపై జాతీయ వర్క్‌షాప్‌ నిర్వహించారు. ఏయూ డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ చైర్‌ ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్‌ కళాశాల ప్రిన్సిపల్‌ ఆచార్య నరసింహారావుతో పాటు న్యాయ కళాశాల ప్రిన్సిపల్‌ ఆచార్య సీతామాణిక్యం పాల్గొని లింగ సమానత్వం ప్రజాస్వామ్య సమాజంలో ఎంత ముఖ్యమైనదో వివరించారు. లింగ సమానత్వం చారిత్రాత్మక ప్రముఖ్యత, ప్రజాస్వామ్య సిద్ధాంతాలపై వ్యక్తలు చర్చించారు. అనంతం వర్క్‌షాపు కన్వీనర్‌, ఏయూ డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ చైర్‌ ప్రొఫెసర్‌ ఆచార్య ఎం.జేమ్స్‌ స్టీఫెన్‌ రచించిన ‘ఎంపవరింగ్‌ ఉమెన్‌ ఫర్‌ ఏ సస్టెయినబుల్‌ ఫ్యూచర్‌’ పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. లింగ సమానత్వం, స్థిరత్వం సాధన కోసం వ్యూహాలను ఈ పుస్తకం వివరిస్తుందని ఆచార్య జేమ్స్‌ స్టీఫెన్‌ వెల్లడించారు. ఆన్‌లైన్‌, ఆఫ్‌లైన్‌ విధానంలో ఈ వర్క్‌షాపును నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ జి.వినోద్‌కుమార్‌, డాక్టర్‌ దివాకర్‌ వాడపల్లి, డాక్టర్‌ సీహెచ్‌ ప్రవీణ్‌ తదితరులు పాల్గొన్నారు.